క్లుప్తంగా

తరావీ నమాజ్‌తో అల్లాహ్ కృప



దారుల్ మసీదులో తరావీ నమాజు చదివిస్తున్న మౌలానా ఖాజీ అబ్దుల్ మాజిద్

కర్నూలు (న్యూటౌన్) : తరావీ నమాజ్ (ప్రార్థన)లో పాల్గొని అల్లాహ్ కృపకు పాత్రుల వ్వాలని జమియత్ ఉలామ జిల్లా అధ్యక్షుడు మౌలానా ఖాజీ అబ్దుల్ మాజిద్ సాహెబ్, జిల్లా కార్యదర్శి హఫీజ్ అబ్దుస్ సమీ అసద్ అన్నారు. ఆదివారం దారుల్ మసీదులో నాల్గవ రోజు తరావీ నమాజ్ కొనసాగింది. వారు మాట్లాడుతూ ఈనెల 21 నుంచి 30వ తేదీ వరకు ప్రతిరోజూ రాత్రి 8:30 గంటలకు జరిగే తరావీ ప్రార్థనలో ఖురాన్‌లోని మూడు పారాలు పఠించడం జరుగుతుందన్నారు. ముస్లిం సోదరులందరూ పవిత్ర రంజాన్ మాసంలో ఉపవాస దీక్షలు కొనసాగిస్తూ తరావీ నమాజ్‌లో పాల్గొని అల్లాహ్ కృపకు పాత్రులవ్వాలని కోరారు. పది రోజుల్లో తరావీ నమాజులో ఖురాన్‌లోని 30 పారాలు చదివి పూర్తి చేస్తామని అన్నారు.

భక్తిశ్రద్ధలతో 16 రోజుల పండుగ



స్వామి వారికి పూజలు నిర్వహిస్తున్న అర్చకుడు

ఓర్వకల్లు : మండలంలోని కాల్వబుగ్గ దేవస్థానంలో వెలసిన భ్రమరాంబికా బుగ్గరామేశ్వరస్వామి వారికి ఆదివారం భక్తిశ్రద్ధలతో 16 రోజుల పండుగను నిర్వహించారు. మహాశివరాత్రి పర్వదినం ముగిసిన 16 రోజులకు సంప్రదాయంగా జరుపుకునే వేడుకల్లో భాగంగా ఆలయ అర్చకులు కల్లె లక్ష్మీనారాయణశర్మ, నరసింహశర్మలు స్వామి, అమ్మవార్లకు అభిషేకార్చనలు నిర్వహించి, నైవేద్యాలను సమర్పించి ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం కార్యనిర్వాహణాధికారి డీఆర్‌కేవీ ప్రసాద్‌తో పాటు ఉత్సవ కమిటీ సభ్యులు కంకణాల వితరణ చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

కేసీ కాల్వకు నీటి విడుదల

గూడూరు: కర్నూలు ప్రజల తాగునీటి అవసరాల కోసం సుంకేసుల రిజర్వాయర్ నుంచి కేసీ కాల్వకు ఆదివారం 81 క్యూసెక్కుల నీటిని విడుదల చేసినట్లు డ్యాం అధికారులు తెలిపారు. డ్యాంలో కేవలం 0.050 టీఎంసీల నీరు ఉన్నట్లు పేర్కొన్నారు.

ఇంటర్ ప్రవేశానికి దరఖాస్తుల స్వీకరణ

గూడూరు రూరల్: జూలకల్ ఆదర్శ, జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశానికి విద్యార్థుల నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నట్లు ప్రిన్సిపల్ దిల్షాద్ తెలిపారు. 2024–25 విద్యా సంవత్సరంలో ఇంటర్ మొదటి ఏడాది ప్రవేశానికి 10వ తరగతి విద్యార్థులు ఈ నెల 28వ తేదీ నుంచి మే 22వ తేదీ వరకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.

హంద్రీకి చేరిన ఎల్ఎల్‌సీ నీరు



ముడుమలగుర్తి వద్ద హంద్రీకి చేరుతున్న నీరు

కోడుమూరు రూరల్: వర్షాభావ పరిస్థితులు, వేసవి ప్రభావంతో హంద్రీ నది ఎండిపోయి నదీ పరివాహక ప్రాంతాలైన కోడుమూరు, వర్కూరు, ముడుమలగుర్తి, గోరంట్ల గ్రామాల్లో తీవ్ర మంచినీటి సమస్య తలెత్తింది. నీటి సమస్య పరిష్కారం కోసం జిల్లా అధికారుల ఆదేశాల మేరకు ఇరిగేషన్ అధికారులు వారం రోజుల నుంచి ఎల్ఎల్‌సీ నీటిని వర్కూరు శుద్ధ వాగు మీదుగా 40 క్యూసెక్కుల చొప్పున హంద్రీ నదిలోకి విడుదల చేస్తున్నారు. ఈ నీరు ఆదివారం సాయంత్రం నాటికి కోడుమూరు దాటి ముడుమలగుర్తి గ్రామంలోని హంద్రీ నదికి చేరుకుంది. మరో నాలుగైదు రోజుల పాటు నీటి ప్రవాహం ఇలాగే కొనసాగితే గోరంట్ల గ్రామాన్ని చేరడంతో పాటు, త్వరలో జరిగే గోరంట్ల తిరునాలకు వచ్చే భక్తులకు నీటి సమస్య తీరుతుంది.

సారా స్థావరాలపై దాడులు



సారా స్థావరంపై దాడులు నిర్వహిస్తున్న పోలీసులు

ఓర్వకల్లు : మండలంలోని గుమ్మితంతండాలో నాటు సారా స్థావరాలపై పోలీసులు విస్తృత దాడులు నిర్వహించారు. కర్నూలు రూరల్ సీఐ కిరణ్‌కుమార్‌రెడ్డి, స్థానిక ఎస్ఐ రాజారెడ్డి పోలీసు సిబ్బంది ఆదివారం మండలంలోని గుమ్మితంతండాలో చేపట్టిన దాడుల్లో 2000 లీటర్ల సారా ఊటను ధ్వంసం చేసి, నిర్వాహకుల నుంచి 50 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. వారు మాట్లాడుతూ.. తండాలో ఎవరైనా నాటు సారాను తయారు చేసినా?, సారాను విక్రయాలు జరిపినా? పేకాట, మట్కా, వంటి అసాంఘిక కార్యకలాపాలు చేసినట్లయితే చట్టపరంగా చర్యలు తీసుకొని కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.



అలయ ప్రాంగణంలో భక్తుల సందడి



ఆకట్టుకున్న పొటేళ్ల ఫలహార బండి



అన్నదానం చేస్తున్న నిర్వాహకులు

వైభవంగా శ్రీచెన్న సోమేశ్వరస్వామి ఉత్సవాలు

- నేటి మహారథోత్సవానికి సర్వం సిద్ధం
- భక్తులతో కిటకిటలాడుతున్న ఆలయ ప్రాంగణం
- భక్తులకు అన్నదానం
- నేటి నుంచి ఎద్దుల బండలాగుడు పోటీలు





ప్రత్యేక అలంకరణలో చెన్న సోమేశ్వరస్వామి, అమ్మవారు

సి.బెళగల్: పోలకల్ గ్రామంలోని శ్రీచెన్న సోమేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం జరిగే మహా రథోత్సవానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆదివారం స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. పలువురు భక్తులు తలనీలాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. స్వామి ఉత్సవాల సందర్భంగా భక్తులకు వసతితో పాటు గ్రామస్తుల సహకారంతో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు ఆలయ ధర్మకర్త పద్మనాభరెడ్డి తెలిపారు.

ఆకట్టుకున్న భక్తుల ఫలహారాల బండ్లు

శ్రీచెన్న సోమేశ్వరస్వామి ఉత్సవాల్లో ఫలహార ఎడ్ల బండ్లు ఊరేగింపు ఆకట్టుకున్నాయి. ఫలహార బండ్లకు భక్తులు రంగుల కాగితాలు, మామిడి తోరణాలతో సుందరంగా అలంకరించారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన భక్తులు ఎడ్ల బండ్లలో ఫలహారాల తీసుకుని ఆలయానికి చేరుకుని మొక్కులు చెల్లించుకున్నారు. సి.బెళగల్‌తో పాటు కంబదహాల్, సంగాల, పలుకుదొడ్డి, క్రిష్ణదొడ్డి, ముడుమాల, ఇనగండ్ల, మారందొడ్డి గ్రామాలకు చెందిన భక్తులు ఎక్కువ సంఖ్యలో ఎడ్ల బండ్లపై పోలకల్ చేరుకుని స్వామి వారికి మొక్కులు సమర్పించుకున్నారు. కాగా గ్రామానికి చెందిన కొవ్వ శ్రీరాములుకు చెందిన రెండు పొట్టేళ్లతో ఫలహారబండి ఆకట్టుకుంది. ఉత్సవాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఐదుగురు ఎస్ఐలు, 40 మంది పోలీస్ సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేసినట్లు కోడుమూరు సీఐ సీఐ మన్సూరుద్దీన్ తెలిపారు.

నేటి రథోత్సవానికి ఏర్పాట్లు పూర్తి

సోమవారం వేకువజామున 4:30 గంటలకు నిర్వహించే స్వామి వారి రథోత్సవానికి అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆలయ ప్రధాన అర్చకుడు బీచుపల్లయ్య తెలిపారు. ఆదివారం అర్ధరాత్రి చలువ కాగులను ఊరేగింపుగా ఆలయానికి చేర్చిన అనంతరం ఉత్సవ విగ్రహాలను రథంపై ఉంచి, ఆలయం ఎదురుగా ఉన్న మండపం వరకు మహా రథోత్సవాన్ని నిర్వహించనున్నారు. సాయంత్రం పార్వతీ దేవి, గంగాదేవి సమేత చెన్నసోమేశ్వరస్వామికి పారువేట ఉత్సవం నిర్వహించనున్నారు. రాత్రి 9 గంటలకు తోలు బొమ్మలాట ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

నేటి నుంచి బండలాగుడు పోటీలు

ఉత్సవాల సందర్భంగా సోమవారం ఉదయం 9 గంటల నుంచి అంతర్రాష్ట్ర ఎడ్ల బండలాగుడు పోటీలను నిర్వహించనున్నట్లు గ్రామ ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. మొదటి రోజు పాల పళ్ల ఎద్దుల బండలాగుడు పోటీలు, పొట్టేళ్ల పోటీలు, మంగళవారం క్యాటగిరి సైజు పోటీలు ఉంటాయని చెప్పారు. ఆసక్తి ఉన్న వారు ముందుగా ఎంట్రీ ఫీజు చెల్లించి పాల్గొనాలని కోరారు. వివరాలకు 7995919494, 9951861765 నంబర్లను సంప్రదించాలన్నారు.



మహా రథోత్సవానికి సిద్ధమైన రథం

ఘనంగా అల్లిషాస్వామి ఉరుసు



గంధాన్ని తీసుకెళ్తున్న నిర్వాహకులు

సి.బెళగల్: మండల కేంద్రం సి.బెళగల్‌లో ఆదివారం హోసూరు అల్లిషా స్వామి ఉరుసును ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామున 4 గంటలకు గంధాన్ని తీసుకుని ఊరేగింపుగా బయలుదేరారు. ఉదయం 7 గంటలకు దర్గాకు చేరుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆయా ప్రాంతాల నుంచి వచ్చిన పక్కీర్లు తమ శరీరాలకు ఇనుప చువ్వలను గుచ్చుకుని భక్తిభావాన్ని చాటుకున్నారు. కాగా ఉరుసు సందర్భంగా గ్రామంలో భజన పోటీలు, తత్వ బోధనలను ఏర్పాటు చేశారు. భక్తులకు అన్నదానం చేసినట్లు నిర్వాహకుడు హారిఫ్ తెలిపారు.

సారా బట్టీ ధ్వంసం



లక్ష్మీపురంలో సారా బట్టీని ధ్వంసం చేస్తున్న సెబ్ అధికారులు

కోడుమూరు: కోడుమూరు సెబ్‌స్టేషన్ పరిధిలోని వెల్దుర్తి మండలం లక్ష్మీపురం వద్ద నిర్వహిస్తున్న నాటు సారా స్థావరంపై ఆదివారం పోలీసులు దాడులు నిర్వహించారు. 1,750 లీటర్ల బెల్లం ఊట, 15 లీటర్ల సారాను ధ్వంసం చేసినట్లు సెబ్ సీఐ రామాంజనేయులు తెలిపారు. సారా బట్టీ నిర్వహిస్తున్న అదే ప్రాంతానికి చెందిన బోయ అశోక్, అయ్యస్వామిపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. దాడుల్లో ఎస్ఐ అలీబేగ్, కానిస్టేబుళ్లు హనుమంతు, శంకర్ నాయక్, విరుపాక్షిరెడ్డి, వెంకటేష్ నాయక్, అన్వర్ బాషా పాల్గొన్నారు.



అగ్ని ప్రమాదంలో కాలిపోయిన చెక్కల దుకాణం



పూర్తిగా కాలిపోయిన ఆటో

నిర్లక్ష్యం ఖరీదు.. ఐదు షాపులు దగ్ధం

- చెక్క, స్పేర్ పార్ట్స్ షాపులు, ఆటోలు అగ్నికి ఆహుతి
- సంఘటనా స్థలాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్, ఇంతియాజ్

కర్నూలు(అర్బన్): చిన్న నిర్లక్ష్యం ఐదు షాపులను అగ్నికి ఆహుతయ్యేలా చేసింది. సిగరెట్ తాగి ఆర్పకుండా చెత్త కుప్పలో పడవేయడంతో మంటలు అంటుకుని భారీ ఆర్థిక నష్టానికి దారి తీసింది. నగరంలోని కొత్త బస్టాండ్ సమీపం కల్లూరుకు వెళ్లే దారిలో ఉన్న గొర్రెల సంత జరిగే ప్రదేశంలో ఆదివారం సాయంత్రం జరిగిన అగ్ని ప్రమాద సంఘటనలో ఐదు షాపులు దగ్ధమయ్యాయి. ఈ ప్రాంతంలో ఎస్.అబ్దుల్, బి.జాకీర్‌బాషా, ఎస్.మహమ్మద్ ఆలీ, ఎస్‌పీ సలీం, సి.శ్రీనివాసులుకు చెందిన టేకు ఉడ్, పేపర్ ప్లేట్స్, కవర్స్, ఆటో స్పేర్ పార్ట్స్, మెకానిక్ షాపులు ఉన్నాయి. షాపుల సమీపంలో ఉన్న చెత్తలో వేసిన సిగరెట్ అంటుకుని సమీపంలోని చెక్క సామాను షాపుతో పాటు పక్కనే ఉన్న ఇతర షాపులకు మంటలు వ్యాపించడంతో భారీగానే నష్టం జరిగింది. మంటల్లో రెండు ఆటోలు పూర్తిగా దగ్ధమయ్యాయి. సమాచారం అందిన వెంటనే కర్నూలు అగ్ని మాపక సిబ్బంది రెండు ఫైర్ఇంజన్ల సహాయంతో అధిక నష్టం జరగకుండా మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. ఐదు షాపుల్లో కలిపి మొత్తం రూ.60 లక్షల నుంచి రూ.70 లక్షల వరకు నష్టం ఉంటుందని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



అగ్ని ప్రమాద బాధితులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్, ఇంతియాజ్

సంఘటనా స్థలాన్ని పరిశీలించిన హఫీజ్‌ఖాన్, ఇంతియాజ్

అగ్ని ప్రమాదం జరిగిందనే సమాచారం తెలిసిన వెంటనే కర్నూలు ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్, వైఎస్సార్‌సీపీ కర్నూలు ఎమ్మెల్యే అభ్యర్థి ఇంతియాజ్ సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. ఈ సందర్భంగా సంఘటన జరిగిన తీరును, నష్టాన్ని బాధితులు వారి దృష్టికి తీసుకొచ్చారు. జరిగిన సంఘటనను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు.

సాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు

- కొచ్చెరువు పూడికతీత, మరమ్మతులు, ఏటిపాయ చెక్‌డ్యామ్‌పై ప్రత్యేక దృష్టి
- నిర్మాణాలు, పనులపై ప్రభుత్వానికి నివేదిక పంపాం
- ఎన్నికల కోడ్‌తో ఆగిన ప్రక్రియ
- ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి



రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

పాణ్యం: సాగునీటి కొరతను అధిగమించేందుకు ఉన్నవనరులను సమృద్ధిగా వినియోగించుకునేలా ఏడాది క్రితం మైనర్ ఇరిగేషన్‌కు సంబంధించి పలు ప్రతిపాదనలు ఇచ్చామని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి తెలిపారు. ఆదివారం పాణ్యంలో జరిగిన ఓ వివాహ వేడుకలో పాల్గొన్న అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ప్రస్తుత వేసవిలో నీటి సమస్యలను గుర్తించి ముందుగానే కొచ్చెరువు పూడిక తీతకు, నీటి నిల్వ, గాలేరు కాల్వ నుంచి నీటిని పంపింగ్ చేసేందుకు ప్రతిపాదనలు ఇచ్చామన్నారు. కొచ్చెరువులో నీరు నిల్వ ఉంటే ఆయకట్టు కింద రైతులకు పుష్కలంగా నీరు అందడంతో పాటు సుగాలిమెట్ట, ఆలమూరు, కొణిదేడు, పాణ్యం గ్రామాలోని వ్యవసాయ బోర్లకు నీరు సమృద్ధిగా అందుతాయని ప్రభుత్వానికి నివేదించామన్నారు. ప్రస్తుతం ఈ చెరువులో నీరు లేని కారణంగా ఆయా గ్రామాల్లోని వ్యవసాయబోర్లు రీచార్జ్ కావడం లేదని చెప్పారు. అంతేకాక చెరువులో నీరు ఉంటే సుగాలిమెట్ట, పాణ్యం, కందికాయపల్లె నుంచి వలసవెళ్లే పశువులకు నీరు లభిస్తుందన్నారు. నాలుగు సంవత్సరాలుగా నీటి సమస్య తలెత్తలేదని, ఈ సారే నీటి సమస్య ఎదురైందన్నారు. పరిస్థితిని ముందగానే గమనించి చెరువు అభివృద్ధి కోసం, నీటిని పంపింగ్ చేసే విషయంపై మంత్రికి ప్రతిపాదనలు అందించామన్నారు. అయితే కొంత జాప్యం కావడం, ఎన్నికల కోడ్ రావడంతో తదుపరి చర్యలు నిలిచిపోయారని చెప్పారు. ప్రస్తుతం గోరుకల్లు జలాశయం నుంచి నీటి వినియోగం ప్రతి ఏటా పెరుగుతుందన్నారు. అందుకే నీటి వనరులు పెంచుకోవాలనే ఉద్దేశంతో ప్రతిపాదించామని తెలిపారు. అనంతరం ఈనెల 28న జరిగే మేమంతా సిద్ధంకు సంబధించి కార్యాచరణను వివరించారు. ప్రతి గ్రామం నుంచి కార్యకర్తలు, అభిమానులు, నాయకులు తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు సద్దల సూర్యనారాయణరెడ్డి, సుబ్బరాయుడు, ఉప సర్పంచ్ పాలం చంద్రశేఖర్‌రెడ్డి, జాకీర్‌హుసేన్, గౌడ్, గోవర్ధన్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, బాబు, రాజన్న తదితరులు పాల్గొన్నారు.

నేడు పాణ్యంలో ఎన్నికల ప్రచారం

పాణ్యం : ఎన్నికల ప్రచారంలో భాగంగా ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి సతిమణి కాటసాని ఉమామహేశ్వరమ్మ సోమవారం మండల కేంద్రంలో ప్రచారం ప్రారంభించనున్నారు. ఉదయం 8గంటలకు పాణ్యంలోని శ్రీ భృంగీశ్వరస్వామి ఆలయం వద్ద పూజలు చేసి ఎస్సీ కాలనీలో ప్రచారం ప్రారంభించనున్నారు. కాలనీ పర్యటించి ప్రభుత్వం, ఎమ్మెల్యే చేసిన అభివృద్ధిని గురించి వివరించనున్నారు.

ఘనంగా మట్టల ఆదివారం



ప్యాలకుర్తిలో మట్టలతో ర్యాలీగా వెళుతున్న క్రైస్తవులు



తాటిమట్టలతో ఊరేగింపు నిర్వహిస్తున్న క్రైస్తవులు

కోడుమూరు రూరల్: మండలంలోని ప్యాలకుర్తి ఏబీఎం చర్చి ఆధ్వర్యంలో ఆదివారం మట్టల పండుగను ఘనంగా జరుపుకున్నారు. ఏసును కీర్తిస్తూ గ్రామ వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఏబీఎం చర్చి రెవరెండ్ రవికుమార్, సంఘకాపరులు రాజు, రమేష్, రవి, అజయ్, సునీల్, ప్రసాద్ పాల్గొన్నారు.

పాణ్యం : మండలంలోని ఆయా గ్రామాల్లో క్రైస్తవులు మట్టల ఆదివారాన్ని ఘనంగా జరుపుకున్నారు. చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేపట్టారు. ప్రపంచ శాంతి కోసం, విజయానికి సూచికగా మట్టల ఆదివారం జరుపుకుంటారని పాస్టర్లు తెలిపారు. పాణ్యంలోని అగేపా చర్చిలో పాస్టర్ ఏసన్న ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. అలాగే సువార్త చర్చిలో, ఆలమూరు చర్చిలో ప్రార్థనలు నిర్వహించి మట్టలతో ఊరేగింపు నిర్వహించారు.

తైక్వాండోలో ఉచిత శిక్షణ

కర్నూలు (టౌన్): మార్షల్ ఆర్ట్స్ తైక్వాండోలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు కోచ్ వెంకటేశ్వర్లు తెలిపారు. ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి మే 31వ తేదీ వరకు రెండు నెలలు శిక్షణ ఇస్తామన్నారు. స్థానిక పెద్ద మార్కెట్ కేఎంసీ పార్కులో ప్రతి రోజు ఉదయం శిక్షణ తరగతులు ఉంటాయన్నారు. వివరాలకు 9849971256 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

యథావిధిగా మంచినీటి సరఫరా

కర్నూలు (టౌన్): నగరపాలక సంస్థ పరిధిలో మంచినీటి సరఫరా యథావిధిగా కొనసాగుతుందని కమిషనర్ భార్గవ్‌తేజ తెలిపారు. స్థానిక ఐటీసీ వద్ద 500 ఎంఎం పైప్‌లైన్ మరమ్మతు పనులు పూర్తి చేసినట్లు తెలిపారు. ఓల్డ్ కల్లూరు, క్రిష్ణనగర్, ఆదిత్య నగర్, కొత్తబస్టాండ్, చల్లా వారి వీధిల్లో నీటి సరఫరా ప్రణాళిక ప్రకారం జరుగుతుందని పేర్కొన్నారు.

ఓటు వేయడం పౌరుల హక్కు

కోడుమూరు రూరల్: ఎన్నికల్లో ప్రజలంతా స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోడుమూరు ఎస్ఐ బాలనరసింహులు అన్నారు. ఆదివారం కోడుమూరు మండలంలోని వెంకటగిరి, వర్కూరు, ప్యాలకుర్తి గ్రామాల్లో కేంద్ర బలగాలతో కలిసి కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ.. ఎన్నికల్లో ఓటర్లు ఎలాంటి ప్రలోభాలకు లోనుకాకుండా తమకు నచ్చిన వ్యక్తికి నిర్భయంగా ఓటు వేసుకోవాలని సూచించారు. ఎన్నికల వేళ ఎవరైనా గ్రామాల్లో అలజడులు సృష్టించాలని చూస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు ఏవైనా సమస్యలుంటే పోలీసుల దృష్టికి తీసుకొచ్చి ప్రశాంతంగా పరిష్కరించుకోవాలని ఎస్ఐ గ్రామస్తులను కోరారు.



వెంకటగిరిలో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

కొబ్బరి బోండాల లారీ బోల్తా



వెల్దుర్తి(కృష్ణగిరి): వెల్దుర్తి పట్టణ సమీపంలోని డోన్ రైల్వే గేటు అవతల హైవే -44 యు జంక్షన్‌లో కొబ్బరి బోండాల లోడ్‌తో వెళ్తున్న హర్యానాకు చెందిన లారీ బోల్తా పడింది. మధురై నుంచి కొబ్బరి బోండాల లోడ్‌ను ఢిల్లీకి తీసుకెళ్తూ డోన్ దాటుకుని వచ్చి ఆదివారం తెల్లవారుజామున అదుపుతప్పి బోల్తా పడింది. లారీ ఉన్న డ్రైవర్, క్లీనర్ సురక్షితంగా బయటపడగా కొబ్బరిబోండాలు రోడ్డుపై చెల్లాచెదురుగా పడ్డాయి. రూ.లక్షల్లో ఆస్తి నష్టం సంభవించింది. హైవే పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని ప్రమాదానికి గురైన లారీని పక్కకు తొలగించి ట్రాఫిక్ క్లియర్ చేశారు.

‘మేమంతా సిద్ధం’ సభను విజయవంతం చేద్దాం

- వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని
- కల్లూరు, ఓర్వకల్లు మండలాల నేతలతో సన్నాహక సమావేశం



మాట్లాడుతున్న పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు: నంద్యాల జిల్లాలో ఈ నెల 28న జరగనున్న మేమంతా సిద్ధం కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం సాయంత్రం తన స్వగృహంలో కల్లూరు అర్బన్, కల్లూరు గ్రామీణ, ఓర్వకల్లు మండలాల నాయకులు, కార్యకర్తలతో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఈ నెల 27న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మేమంతా సిద్ధం పేరుతో బస్సు యాత్ర ప్రారంభిస్తున్నారని తెలిపారు. బస్సు యాత్ర ఇడుపులపాయలో ప్రారంభమై ఇచ్ఛాపురం వరకు కొనసాగుతుందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇడుపులపాయలోని దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి సమాధి వద్ద నివాళులర్పించి, యాత్ర ప్రారంభిస్తారన్నారు. సాయంత్రం ప్రొద్దుటూరులో బహిరంగ సమావేశంలో పాల్గొని అదే రోజు రాత్రి నంద్యాల జిల్లా ఆళగడ్డలో రాత్రి బస చేయనున్నారని తెలిపారు. 28న సాయంత్రం నంద్యాలలో బహిరంగ సభలో పాల్గొంటారని, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

నియోజకవర్గం ఎంతో అభివృద్ధి చెందింది

వైఎస్సార్‌సీపీ ఐదేళ్ల పాలనలో పాణ్యం నియోజకవర్గం ఎంతో అభివృద్ధి చెందిందని ఎమ్మెల్యే అన్నారు. ఓర్వకల్లు మండలంలో నిర్మించనున్న మల్లికార్జున రిజర్వాయర్‌తో కల్లూరు అర్బన్, ఓర్వకల్లు, గడివేముల మండలాలకు సాగు, తాగు నీరు అందుతుందన్నారు. అమ్మ ఒడి, వైఎస్సార్ ఆసరా, చేయూత, సున్నావడ్డీ, జగనన్న వసతి దీవెన, విద్యా దీవెన వంటి పథకాలతో పేద ప్రజల జీవితాలు మెరుగుపడ్డాయన్నారు. వలంటీర్, సచివాలయ వ్యవస్థలతో ప్రజల చెంతకే పాలన తీసుకొచ్చామన్నారు. గ్రామాల్లోనే సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, ఆరోగ్య కేంద్రాలు ఏర్పాటు చేసి ప్రజల చెంతకు పాలన తీసుకొచ్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందన్నారు. గతంలో రైతులు పంటలకు కావాల్సిన ఎరువులు, పురుగు మందుల కోసం జిల్లా, మండల కేంద్రాలకు వెళ్లేవారని.. ప్రస్తుతం ఆర్‌బీకేలోనే అన్ని రకాల ఎరువులు, పురుగు మందులు అందుబాటులో ఉంటున్నాయని తెలిపారు. గడివేముల మండలంలో జొన్న రైతులపై టీడీపీ నాయకులు అసత్యాలు, అబద్ధాలు ప్రచారం చేశారన్నారు. జొన్న రైతులు ఇబ్బందులు పడకుండా మార్క్‌ఫెడ్ అధికారులతో మాట్లాడి పంట కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. టీడీపీ అధినేత చంద్రబాబు తన పాలనలో ఏనాడు రాయలసీమ అభివృద్ధి గురించి ఆలోచించలేదని విమర్శించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ మహేశ్వర్‌రెడ్డి, కర్నూలు మార్కెట్ యార్డు చైర్మన్ ప్రభాకర్ రెడ్డి, వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు, కల్లూరు అర్బన్‌లోని కార్పొరేటర్లు, ఓర్వకల్లు, కల్లూరు మండలాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

2019 ఫలితాలు పునరావృతం

మే 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో నంద్యాల జిల్లాలో మరోసారి 2019 ఫలితాలే పునరావృతమవుతాయని ఎమ్మెల్యే అన్నారు. ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా నాలుగు సిద్ధం సభలు ఘన విజయం సాధించాయని తెలిపారు. మేమంతా సిద్ధం బస్సు యాత్ర సభలు కూడా అదే తరహాలో విజయవంతమవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్‌కు మరోసారి ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని ఎన్నుకోవడానికి ప్రజలంతా సంసిద్ధంగా ఉన్నారన్నారు.



హాజరైన వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు